క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో సంగీత దర్శకుడు మాధవపెద్ది


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న మాధవపెద్ది సురేష్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ సతీసమేతంగా సోమవారం దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనంతోపాటు, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

కలెక్టర్‌తో సింహాచలం ఈవో భేటీ


కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు ప్రసాదం అందిస్తున్న సింహాచలం ఈవో త్రినాథరావు

మహారాణిపేట: సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో)గా పదవీ బాధ్యతలు చేపట్టిన వి.త్రినాథరావు సోమవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు సింహాచలం ప్రసాదం అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: వాహన డ్రైవర్లు రహదారి భద్రత నిబంధనల్ని ఖచ్చితంగా పాటించాలని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. స్థానిక సబ్‌స్టేషన్, మండల పరిషత్ కూడలి, సింహాద్రి కూడలి, రాంకీ ఎస్ఈజెడ్ కూడలి, లంకెలపాలెం కూడలి ప్రాంతాల్లో సోమవారం డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నియమాల్ని పాటించాలన్నారు. రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలను నిలిపితే చర్యలు తప్పవన్నారు. మితిమీరిన వేగంతో, మద్యం సేవించి వాహనాలను నడపవద్దని హెచ్చరించారు. ట్రాఫిక్ రూల్స్‌ను ప్రతి ఒక్కరూ పాటిస్తూ, ప్రమాదాల నివారణకు తమతో సహకరించాల్సిందిగా కోరారు.

నేడు అప్పన్న ఆలయంలో శాంతి హోమం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం శాంతి హోమం నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 10.30 వరకు ఆలయ కల్యాణమండపంలో హోమాన్ని జరిపేందుకు ఏర్పాట్లు చేశారు.

బస్ షెల్టర్ ఏర్పాటుకు వినతి


జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన వినతి పత్రాన్ని చూపిస్తున్న యూత్ నాయకులు

పరవాడ: స్థానిక సబ్‌స్టేషన్ కూడలిలో ప్రయాణికులకు అవసరమైన బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌ను కోరగా, అందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు పరవాడకు చెందిన యూత్ నాయకులు వర్రి చంద్రశేఖర్, బండారు చిన్నంనాయుడు చెప్పారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి

- జెడ్సీ హైమావతి

గోపాలపట్నం: ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని జోనల్ కమిషనర్ హైమావతి అన్నారు. 90వ వార్డు వినోద్‌నగర్‌లో రూ.33.50 లక్షలతో నిర్మించ తలపెట్టిన సామాజిక భవనం పనులకు సోమవారం స్థానిక కార్పొరేటర్ బొమ్మిడి రమణతో కలసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ విభాగం ఏఈ వెంకలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, వినోద్ నగర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విజినిగిరిపాలేనికి ఆర్టీసీ బస్సు నడపరూ..!

విజినిగిరిపాలెం.. సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వరాహపుష్కరిణి మీదుగా ఓ 3 కి.మీ. దూరం. ఒకటిన్నర దశాబ్దాల క్రితం ఆ ఊరికి రోజుకు రెండుసార్లు ఆర్టీసీ బస్సు నడిచేది. అప్పట్లో జనాభా తక్కువ. ఆ 3 కి.మీ. మధ్యలో పెద్దగా జనావాసాల్లేవు. ఇపుడు ఊరు అభివృద్ధి చెందింది. మధ్యలో ఉన్న 3 కి.మీ.లో ఆధునిక కాలనీలు వెలిశాయి. జనాభా పెరిగింది. విచిత్రమేంటంటే ఇప్పుడా ఊరికి ఆర్టీసీ బస్సు సర్వీసే లేదు. అడిగితే ఇదిగో.. అదిగో.. అంటూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.


విజినిగిరిపాలేనికి వెళ్లే రహదారి


విజినిగిరిపాలేనికి వెళ్లే మార్గంలో ఉన్న కృష్ణానగర్‌కి నడిచి వెళ్తున్న నివాసితులు

- గ్రామస్తులు, విద్యార్థులు, ఉద్యోగుల విన్నపం
- బస్సు సౌకర్యం లేక రాకపోకలకు ఇబ్బందులు
- పదిహేనేళ్ల క్రితం రోజూ రెండు ట్రిప్పులు
- ఇప్పుడు జనాభా పెరిగినా.. ఆర్టీసీ తాత్సారం

సింహాచలం: గ్రేటర్ విశాఖ 98వ వార్డులోని విజినిగిరిపాలెం గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో మూడు వందలకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. రైతాంగం ఎక్కువ. తరతరాలుగా రైతులు కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. పండించిన పంటలను అడవివరం, శ్రీనివాసనగర్‌లో జరిగే వారాంతపు సంతలకు తరలిస్తుంటారు. వరాహ పుష్కరిణి నుంచి విజినిగిరిపాలేనికి వెళ్లే మార్గంలోనే ఎంఎంటీసీ కాలనీ, చంద్రాగార్డెన్స్, కృష్ణానగర్ తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఈ ప్రాంతాలు ఇటీవల బాగా అభివృద్ధి చెందాయి. నగరం నుంచి పలువురు ఈ ప్రాంతాల్లో స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. ఇప్పుడు జనాభా అటూఇటుగా మూడువేలు. అయినా బస్సు సర్వీసును నడిపేందుకు ఆర్టీసీ ముందుకురావట్లేదని స్థానికులు ఆక్షేపిస్తున్నారు.

5వ తరగతి దాటితే.. బయటికే..!

విజినిగిరిపాలెంలో ఐదవ తరగతి వరకు మాత్రమే ప్రభుత్వ పాఠశాల ఉంది. ఆ తర్వాత పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే పేద, దిగువ మధ్యత తరగతి విద్యార్థులు అడవివరం గ్రామానికి వెళ్లాల్సిందే. ప్రైవేటు పాఠశాలలకు, కళాశాలలకువెళ్లే విద్యార్థులు నగరంలోకి వెళ్లాలి. ఈ ప్రాంతానికి చెందిన సుమారు 300 మంది విద్యార్థులు నగరంలోని స్కూళ్లు, కళాశాలలకు వెళ్తున్నారు. దాదాపు 200 మంది ప్రైవేటు ఉద్యోగస్తులు, ఇతర పనులపై వెళ్లే గ్రామస్తులు నిత్యం నగరంలోకి రాకపోకలు సాగిస్తుంటారు. వీరంతా ఆటోలను, సొంత వాహనాలను, లేకుంటే కాలినడకన సింహాచలం వచ్చి బస్సు ఎక్కాల్సి వస్తోంది.

బస్సు సర్వీసును రద్దు చేసిన ఆర్టీసీ

సుమారు 15 ఏళ్ల క్రితం విజినిగిరిపాలేనికి ఆర్టీసీ బస్సు సర్వీసు కొంతకాలం నడిచింది. సింహాచలం ఆర్టీసీ డిపోకి చెందిన 6వీ బస్సు ఉదయం, సాయంత్రం సమయాల్లో ఒక్కో ట్రిప్పు చొప్పున నడిచేది. సరిపడా ఆదాయం రావడం లేదంటూ బస్ సర్వీసును రద్దు చేశారు. అప్పట్లో విజినిగిరిపాలెం నుంచి నగరంలోకి వెళ్లి వచ్చేవారి సంఖ్య తక్కువగా ఉండటం, చుట్టు ప్రక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందకపోవడంతో ఆ పరిస్థితి నెలకొంది. ఇప్పుడు విద్యార్థుల సంఖ్యతో పాటు, నగరంలోకి రాకపోకలు సాగించే వారూ పెరిగారు. అయినా బస్సు సర్వీసును నడపట్లేదని గ్రామస్తులు చెప్తున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లా..



విజినినిగిరిపాలేనికి ఆర్టీసీ బస్సును నడపాలని ఆర్టీసీ అధికారులను గతంలో పలుమార్లు కోరాను. ఇటీవల సింహాచలం కొండకి వచ్చిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లాను. గతంతో పోలిస్తే విజినిగిరిపాలెం, పరిసర ప్రాంతాల్లో జనాభా పెరిగింది. రోజూ రాకపోకలకు రైతులు, విద్యార్థులు పడుతున్న బాధలను అర్థం చేసుకుని బస్సు సర్వీసును వెంటనే పునరుద్ధరించాలి.

– మజ్జి అప్పలనాయుడు, విజినిగిరిపాలెం

మూడు ట్రిప్‌లైనా నడపాలి



నేను ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో ముప్పై ఏళ్ల నుంచి ప్రైవేటుగా పనిచేస్తున్నాను. గతంలో విజినిగిరిపాలెం నుంచి నగరంలోని పాతపోస్టాఫీసుకి 6వి బస్సు రెండుసార్లు తిరిగేది. ఉదయం 8కి ఆ బస్సులోనే నగరంలోని బ్యారెక్స్‌కి వెళ్లేవాడిని. రాత్రి 7 గంటలకు తిరిగి ఆ బస్సులోనే వచ్చేవాడిని. జనాభా పెరిగింది. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సర్వీసులుండేలా బస్సును మూడు ట్రిప్‌లైనా నడపాలి.

– పాలూరి శ్రీనివాసరావు, విజినిగిరిపాలెం

పరిశీలించి.. చర్యలు తీసుకుంటాం



విజినిగిరిపాలేనికి బస్సు సర్వీసును పునరుద్దరించే విషయాన్ని పరిశీలిస్తాం. గతంలో బస్సు నడిపినప్పుడు చోటుచేసుకున్న పరిస్థితులను అధ్యయనం చేయాల్సి ఉంది. గ్రామస్తులు కూడా ఒక రిప్రజెంటేషన్ ఇస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. విజినిగిరిపాలెం మార్గాన్ని కూడా ఓసారి పరిశీలించాం. అన్నీ అనుకూలంగా ఉన్నట్లు తేలితే సర్వీసు పునరుద్దరణకు చర్యలు తీసుకుంటాం.

– రాజశేఖర్, డిపో మేనేజర్, సింహాచలం ఆర్టీసీ డిపో

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- 'ఇది మంచి ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పంచకర్ల


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పరవాడ: రానున్న నాలుగున్నరేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై పెదముషిడివాడ గ్రామంలో సోమవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని, ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించి, ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. లంకెలపాలెం–అనకపల్లి రోడ్డు నిర్మాణానికి ఎన్టీపీసీ యాజమాన్యం రూ.70 లక్షలు మంజూరు చేసిందని, త్వరలో రహదారి నిర్మాణ పనులు చేపడతామన్నారు. రోడ్ల మరమ్మతులకు సీఎం చంద్రబాబు రూ.500 కోట్లు విడుదల చేయనున్నట్లు తెలిపారు. పెదముషిడివాడలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గ్రామంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ, అక్రమ గ్రావెల్ తవ్వకాలకు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గండి బాబ్జీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీలపై ప్రజలకు ఎలాంటి నిరాశ వద్దన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రామునాయుడు, సర్పంచ్ పల్లా నాగమణి, ఎంపీటీసీ ఒమ్మి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పరవాడ సినిమాహాలు కూడలిలో తిరుపతి లడ్డూ వివాదానికి వ్యతిరేకంగా ఎమ్మెల్యే పంచకర్ల, కూటమి నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన నిరాహార దీక్షకు మద్దతుగా ఎమ్మెల్యే ఈ దీక్షను నిర్వహించారు. ఈ దీక్ష 11 రోజుల పాటు కొనసాగుతుందన్నారు.

ఏపీఐఐసీ స్థలాన్ని రక్షించండి

మహారాణిపేట: పెందుర్తి మండలం గుర్రంపాలెంలో పరిశ్రమల ఏర్పాటు కోసం ఏపీఐఐసీకి తమ సొంత స్థలాలు ఇచ్చామని, స్థానికులైన తమకు ఎలాంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేదని గ్రామ ప్రజలు వాపోయారు. ఉద్యోగాలు ఇస్తామన్న హామీలను కూడా నేటి వరకు అమలు చేయలేదని, ఈ స్థలాన్ని ఇప్పుడు కొంత మంది ఆక్రమించడానికి చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్‌కు వారు మొర పెట్టుకున్నారు. భారీ వాహనాలు రాకపోకలు సాగించేందుకు ఏపీఐఐసీ కొత్త రోడ్డు నిర్మిస్తోందని, ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు కొంత మంది ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు చిన్నది కావడంతో ఏపీఐఐసీ పెద్ద రోడ్డు నిర్మించడం కోసం స్థలం కేటాయించిందని గ్రామ ప్రజలు వివరించారు. ఏపీఐఐసీ పెద్ద రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నిస్తుండగా.. ప్రజాప్రతినిధులు అడ్డుకోవడం బాధగా ఉందని చెబుతున్నారు. రామవరం, ఎర్రవానిపాలెం తదితర గ్రామాలకు వెళ్లేందుకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ రోడ్డు నిర్మించడంతోపాటు ఇక్కడ స్థాపించిన పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను గుర్రంపాలెం ప్రజలు కోరారు.

ఘనంగా డీఎస్ఎన్ఎల్‌యూ వ్యవస్థాపక దినోత్సవం



వ్యవస్థాపక దినోత్సవంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య సూర్యప్రకాశరావు, కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ) 17వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ యూనివర్సిటీ వ్యవస్థాపన నుంచి నేటి వరకూ కొనసాగిన ప్రగతిని వివరించారు. 54 మంది విద్యార్థులతో ప్రారంభమైన విశ్వవిద్యాలయం నాలుగు కోర్సులతో వేయికిపైగా విద్యార్థులు, 12 రీసెర్చ్ సెంటర్లతో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత ఐపీఆర్ చైర్ వంటి వాటితో అభివృద్ధి చెందిందన్నారు. విశ్వవిద్యాలయానికి విద్యార్థులే పట్టుగొమ్మలని, వారి సర్వతోముఖాభివృద్ధే విశ్వవిద్యాలయ అభివృద్ధి అన్నారు. ఆరంభం నుంచి విశ్వవిద్యాలయ అభివృద్ధిలో బోధన, బోధనేతర సిబ్బంది పాత్ర మరువలేనిదని, వారందరికీ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్, అకడమిక్ డీన్ సోమా భట్టాచార్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పినగాడిలో స్వచ్ఛతా హీ సేవ


డ్రాయింగ్ పోటీల్లో పినగాడి స్కూల్ విద్యార్థులు


పెందుర్తి: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పినగాడి పంచాయతీలో సచివాలయం అధికారులు సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి, పారిశుధ్యంపై అవగాహన కలిగించారు. మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. గ్రామ సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గణనాథుని దర్శించుకున్న అదీప్‌రాజ్


పైడివాడ అగ్రహారంలో వినాయక మండపంలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: గణపతి ఉత్సవాలలో భాగంగా మండలంలోని పైడివాడ అగ్రహారంలో నెలకొల్పిన వినాయక విగ్రహాన్ని మాజీ శాసన సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం దర్శించుకున్నారు. సర్పంచ్ వద్దాది అప్పలరాజుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కొటాన రాము, దాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసమూర్తికి ఘన సత్కారం


శ్రీనివాసమూర్తి దంపతులను సత్కరిస్తున్న ఈవో త్రినాథరావు, ఉద్యోగులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవోగా పనిచేసి మాతృశాఖ రెవెన్యూకి బదిలీపై వెళ్లిన ఎస్.శ్రీనివాసమూర్తి దంపతులను సోమవారం దేవస్థానం ఉద్యోగులు, వైదికులు ఘనంగా సత్కరించారు. సింహగిరిపై కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో దేవస్థానం ఈవో వి.త్రినాథరావు పాల్గొని శ్రీనివాసమూర్తి దంపతులను దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించారు. ఏడాది కాలంపాటు శ్రీనివాసమూర్తి దేవస్థానానికి అందించిన సేవలను అధికారులు, వైదికులు కొనియాడారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, డీఈ హరి, ఏఈవోలు ఆనంద్‌కుమార్, రమణమూర్తి, నరసింగరావు, పీఆర్వో నాయుడు పాల్గొన్నారు.

పాక వెయ్.. అమ్మేసెయ్..!

పేదోడి కష్టాన్ని భూ బ్రోకర్లు దోచుకుతింటున్నారు. కాయకష్టం చేసుకుని సంపాదించిన సొమ్మును ఈ మాయగాళ్లు కాజేస్తున్నారు. తలదాచుకోవడానికి నీడ కోసం జీవితాంతం చెమటోడ్చిన డబ్బును ధారపోస్తే, చివరకు కట్టుబట్టలే మిగులుతున్నాయి. పేద, దిగువ మధ్యతరగతి, చిరుద్యోగులు ఇలాంటి మోసగాళ్ల చేతికి చిక్కి తీవ్రంగా నష్టపోతున్నారు.


కార్మికనగర్ చెరువులో టీడీపీ నాయకుడు అక్రమంగా వేసిన పాక


కార్మికనగర్‌లో అక్రమంగా పాక వేస్తున్న టీడీపీ నాయకుడు

- కార్మికనగర్ చెరువులో టీడీపీ నాయకుల కబ్జాకాండ
- తక్కువ సొమ్ముకు ప్రభుత్వ భూముల్ని విక్రయిస్తున్న ముఠాలు
- పేదలు, చిరుద్యోగులే లక్ష్యంగా రూ.లక్షల్లో దోపిడీ

పెందుర్తి: పెందుర్తి, చినముషిడివాడ కార్మికనగర్ ప్రాంతంలో టీడీపీ నాయకులు బ్రోకర్ల అవతారం ఎత్తి ప్రభుత్వ భూములను, పోరంబోకు స్థలాలను అమ్మేస్తున్నారు. ఏకంగా చెరువులోనే పాగా వేసి ప్లాట్లుగా విభజించి, విక్రయాలు సాగిస్తున్నారు. పేదలను నమ్మించి రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. బ్రోకర్లను నమ్మి పేదలు అక్కడ పాకలు, షెడ్‌లు వేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కార్మికనగర్‌లో ఓ టీడీపీ నాయకుడి అక్రమాలకు అడ్డులేకుండా పోయింది.

పేదల దోపిడీయే లక్ష్యం

పెందుర్తి ప్రాంతంలో ప్రభుత్వ భూములకు కొదవ లేదు. అయితే ఈ భూముల్లో కిందిస్థాయి అధికారుల అండతో కొందరు బ్రోకర్లు పాగా వేశారు. పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్ ప్రాంతాల్లో అయితే చోటామోటా నాయకులు బ్రోకర్ల అవతారం ఎత్తారు. ఖాళీ స్థలాలతో పాటు చెరువులు, కొండలు, ఇతర ప్రభుత్వ స్థలాలను తొలుత చదును చేస్తున్నారు. ముఖ్యంగా కార్మికనగర్ కేంద్రంగా అక్కడ చెరువులో ఓ టీడీపీ నాయకుడు గజాల చొప్పున ప్లాట్లు వేసి పేదోళ్లను, దిగువ మధ్యతరగతి ప్రజల్ని ముగ్గులోకి దించుతున్నాడు. కూలి పనులు, చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకుంటున్నవారికి లక్ష్యంగా చేసుకుని వారిని నమ్మించేందుకు పత్రాలు కూడా సృష్టిస్తున్నాడు. వాటిని చూపించి సదరు స్థలానికి ఒక రేటు నిర్ణయించేసి అమ్మేస్తున్నాడు. తాజాగా చెరువు గర్భంలో నాలుగైదు ప్లాట్లు వేసి ఇటీవలే అమ్మకాలు జరిపినా రెవెన్యూ యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఇప్పటికైనా స్పందించి కార్మికనగర్ చెరువును ఆ టీడీపీ నాయకుడి బారి నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలాలు కొనుగోలు చేయొద్దు



ప్రభుత్వ స్థలాల సంరక్షణే మా బాధ్యత. ప్రభుత్వ స్థలంలో ఎవరు నిర్మాణం చేపట్టినా కూల్చేస్తాం. ఇక అమ్మకాల సంగతి మా దృష్టికి రాలేదు. ఎవరైనా బాధితులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే దానిపై విచారణ జరిపి, చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాలు కొనుగోలు చేస్తే నష్టపోవడం తప్పనిసరి. అంతకుమించి ఇంకేం ప్రయోజనం ఉండదు. కార్మికనగర్‌లో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తాం.

– కోరాడ వేణుగోపాల్, తహసీల్దార్, పెందుర్తి

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నిరసన


ఎన్టీపీసీ వద్ద బ్లాక్ డే కార్యక్రమంలో నినాదాలు చేస్తున్న గనిశెట్టి, కార్మికులు

పరవాడ: కార్మిక హక్కులను కాలరాస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేసి 44 కార్మిక చట్టాల్ని పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. అఖిల భారత కార్మిక సంఘాల పిలుపు మేరకు ఎన్టీపీసీ మెయిన్‌గేటు వద్ద సోమవారం బ్లాక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పాలన సాగిస్తూ కార్మిక హక్కులను కాలరాసేలా చట్టాలు చేయడం అన్యాయమన్నారు. పోరాడి, ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలను మోదీ ప్రభుత్వం రద్దు చేయడాన్ని దేశ వ్యాప్తంగా కార్మిక వర్గం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరిస్తూ కారు చౌకగా పెట్టుబడిదారులకు కట్టబెట్టే చర్యలను మోదీ ప్రభుత్వం విడనాడాలన్నారు. కార్మికులకు కనీస వేతంగా రూ.26 వేలను ఇచ్చి, కార్మిక చట్టాలను సమర్థవంతంగా అమలు చేసి, వారి హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.గోవిందరాజు, వెంకటరావు, పి.పి.నాయుడు పాల్గొన్నారు.

'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'కు 7 వినతులు


వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హైమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 7 వినతులు అందాయి. 97వ వార్డు సప్తగిరినగర్‌లో రోడ్డు నిర్మాణం చేపట్టాలని, అదే ప్రాంతంలో అక్రమంగా వెలసిన ఓ బడ్డీని తొలగించాలని, సుజాతనగర్‌లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేయాలని, 95వ వార్డు లక్ష్మీపురంలో డ్రైన్ల సమస్య తీర్చాలని, 94వ వార్డు ముత్యమాంబ కాలనీలో వాటర్ ట్యాక్స్ తగ్గించాలని, 66వ వార్డు కొత్తపాలెంలోని శ్రీనివాసనగర్ అపార్ట్‌మెంట్‌లో పన్ను సమస్య పరిష్కరించాలని, 96వ వార్డు పెందుర్తిలో పబ్లిక్ ప్రాపర్టీ ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు జోనల్ కమిషనర్ హైమావతిని కోరారు. ఆయా వినతులను స్వీకరించి సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారానికి జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన బాలికల క్రీడా ఎంపిక పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్ఎంసీ చైర్మన్ మళ్ల యోగి తదితరులు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జరుగుతున్న మండల స్థాయి బాలికల క్రీడా ఎంపిక పోటీలు సోమవారం ముగిశాయి. అండర్–14, 17 విభాగాల్లో పోటీలు జరిగాయి. అండర్–17 వాలీబాల్ పోటీల్లో సబ్బవరం ప్రభుత్వ హైస్కూల్, ఆరిపాక జెడ్పీ హైస్కూల్, ఖోఖోలో సబ్బవరం సన్‌రిడ్జ్ స్కూల్, నంగినారపాడు జెడ్పీ హైస్కూల్, కబడ్డీలో ఆరిపాక హైస్కూల్, మల్లునాయుడుపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. బ్యాడ్మింటన్, చెస్‌లో తొలి రెండు స్థానాల్లో సబ్బవరం ప్రభుత్వ హైస్కూల్ నిలిచింది. యోగా విన్నర్స్‌గా నంగినారపాడు జెడ్పీ హైస్కూల్, రన్నర్స్‌గా సబ్బవరం కేజీబీవీ విద్యార్థులు నిలిచారు.

అండర్–14 వాలీబాల్, ఖోఖోలో సబ్బవరం హైస్కూల్, నంగినారపాడు హైస్కూల్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. కబడ్డీలో నంగినారపాడు హైస్కూల్, ఆరిపాక హైస్కూల్, బ్యాడ్మింటన్‌లో సబ్బవరం హైస్కూల్, రావలమ్మపాలెం జెడ్పీ హైస్కూల్ తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. చెస్ విన్నర్స్, రన్నర్స్, యోగా విన్నర్స్‌గా సబ్బవరం హైస్కూల్, యోగా రన్నర్స్‌గా సబ్బవరం కేజీబీవీ నిలిచింది. విజేతలను హెచ్ఎం నాగమల్లేశ్వరరావు, పీడీలు అబ్దుల్ రెహమాన్, చందన వర్మ, ఎస్ఎంసీ చైర్మన్ మళ్ల యోగి అభినందించారు.